
ప్రజాశక్తి

ఆదివారం 18 ఫిబ్రవరి, 2024 5

శ్రీకాకుళం



ఎయిడ్స్ నియంత్రణపై విస్తృత ప్రచారం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణపై ప్రజల్లో మరింత అవగాహన పెంచడానికి గ్రామాల్లో, ప్రభుత్వ కళాశాలల్లో, స్కూళ్లలో కళాజాతా బృందాలతో విస్తృతంగా అవగాహన కల్పించాలని ప్రోగ్రాం అధికారి డాక్టర్ సి.హెచ్.శ్రీదేవి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద కళాజాతాను శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాణాంతకంగా మారిన ఎయిడ్స్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాధి ప్రబలకుండా నియంత్రణ చర్యలు పాటించాలన్నారు. ఒకరి నిర్లక్ష్యం వల్ల కుటుంబ జీవనం చిన్నాభిన్నమవుతుందన్నారు. అందువల్ల ప్రతిఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ నెల 29 వరకు రోజుకు రెండుచోట్ల ఈ ప్రదర్శనలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డెమో పైడి వెంకటరమణ, ప్రోగ్రాం మేనేజర్ ఉమామహేశ్వరరావు, పివిఐ సాంబమూర్తి, ఎన్‌సిడి అప్పారావు పాల్గొన్నారు.

ఆందోళన ఉధృతం చేస్తాం

ఎపి జెఎసి జిల్లా చైర్మన్ సాయిరాం



శ్రీకాకుళం అర్బన్ : ధర్నాలో మాట్లాడుతున్న సాయిరాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లుగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో అనుసరిస్తున్న వైఖరి ఉద్యోగ వర్గాలను తీవ్ర అసంతృప్తికి గురి చేసిందని, ఐదేళ్లుగా ఉద్యోగులు ప్రభుత్వానికి ఎంతగానో సహకరిస్తూ సహనంతో ఉన్నారని ఎపి జెఎసి జిల్లా చైర్మన్, ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం అన్నారు. కలెక్టరేట్ సమీపంలో జ్యోతిరావు పూలే పార్కు వద్ద ఎపి జెఎసి ఆధ్వర్యాన శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగీ పాలన, పాలనేతర అంశాల్లో సంపూర్ణంగా సహకరించామని అన్నారు. కానీ, ఉద్యోగులకు రావాల్సిన డిఎ బకాయిలను ఈ ఐదేళ్లలో చెల్లించలేదని అన్నారు. అలాగే పిఆర్‌సిలోనూ ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేశారన్నారు. దేశచరిత్రలో పిఆర్‌సి ద్వారా ఉద్యోగుల జీతాలు తగ్గించిన ఘనత ప్రస్తుత ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఉద్యోగుల బకాయిల సొమ్ము సుమారు రూ.25 వేల కోట్ల పైబడి రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉందన్నారు. తమ కుటుంబ అవసరాల కోసం ఉద్యోగులు రుణం కోసం దరఖాస్తు చేస్తే సమయానికి డబ్బు చేతికందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి దుస్థితి ప్రభుత్వ ఉద్యోగులు గతంలో ఎప్పుడూ చూడలేదన్నారు. తమ ఆరోగ్య అవసరాల కోసం ప్రతినెలా చెల్లిస్తున్న వైద్య బీమా డబ్బులు సైతం ప్రభుత్వం ఆస్పత్రుల ఖాతాలకు జమచేయకపోవడం దారుణమన్నారు. అలాగే సరెండర్ లీవ్‌ల సొమ్ములు మూడేళ్లుగా రూ.8 కోట్లు బకాయి ఉందన్నారు. 12వ పిఆర్‌సి కోసం కొత్త కమిటీ నియమించడంతో పాటు ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, ఎపిటిఎఫ్ నాయకులు టెంక చలపతిరావులు మాట్లాడుతూ విద్యారంగంలో సమూల మార్పులు తెస్తామని నమ్మబలికి నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పార్వతీశం, ఎన్‌జిఒ నాయకులు పట్నాయక్, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



పలాస : ధర్నా చేస్తున్న జెఎసి నాయకులు

ఆమదాలవలస : బకాయిలు చెల్లించాలని కోరుతూ జెఎసి నాయకులు తహశీల్దార్ కార్యాలయం జూనియర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జెఎసి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బొడ్డేపల్లి మోహనరావు, ఎన్‌జిఒ మండల అధ్యక్ష, కార్యదర్శులు అప్పలరాజు, ఎన్.రమణమూర్తి, జాయింట్ సెక్రటరీ కె.మనోహర్, పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు, కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ, కె.షణ్ముఖరావు, బి.వి.రమణ పాల్గొన్నారు.

పొందూరు : బకాయిలు చెల్లించాలని కోరుతూ జెఎసి నాయకులు పాత తాలూకా కేంద్రం తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం డిటి వెంకటేశ్వరులును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.మధన్‌మోహన్, యుటిఎఫ్ పూర్వ జిల్లా అధ్యక్షులు పొందూరు అప్పారావు, మండల ఉపాధ్యాయ సంఘ నాయకులు కె.విజయ్ కుమార్, రోజా, బస్వా సతీష్, ఎన్.సత్తిరాజు, రఘుపునాయుడు, తేజేశ్వరరావు పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జెఎసి నాయకులు నిరసన తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ బాలమురళీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు సంపతరావు, మోహనరావు, పి.సి.నంద, కోత ధర్మారావు, రోనంకి రామచంద్రరావు, గున్న ప్రసాదరావు, కూర్మ, అనిశెట్టి చిట్టన్న పాల్గొన్నారు. అలాగే అటుగా వచ్చిన వైసిపి నాయకులు చింతాడ గణపతికి సమస్యలను వివరించారు.

పలాస : తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో ఎన్‌జిఒ అధ్యక్షుడు బోనెల గోపాల్, సబ్ ట్రెజరీ ఆఫీసర్ రామారావు, ఎన్‌జిఒ అసోసియేషన్ సెక్రటరీ బి.ఉపేంద్ర, ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, ట్రెజరర్ ఎన్.ఉపేంద్ర, జాయింట్ సెక్రటరీ గిరి ఉదయ శంకర్ పాత్రో, కంచరాను చాణిక్య, విమెన్ వింగ్ రోజా, సిఐటియు సంఘ నాయకులు గణపతి, అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ పాపారావు, పంచాయతీ కార్యదర్శి అప్పారావు పాల్గొన్నారు.



ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న జెఎసి నాయకులు



పొందూరు : వినతిపత్రం అందజేస్తున్న జెఎసి నాయకులు



టెక్కలి : మాట్లాడుతున్న గణపతి

నేడు జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సు

ప్రారంభోపన్యాసం చేయనున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా సమగ్రాభివృద్ధిపై ఈ నెల 18న జిల్లా సదస్సు నిర్వహించనున్నారు. నగరంలోని స్థానిక తిలక్‌నగర్‌లోని యుటిఎఫ్ కార్యాలయంపైన ఎవిఎస్ భవనంలో జరగనున్న సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రారంభోపన్యాసం చేయనున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.నాగమణి ముఖ్య వక్తగా మాట్లాడనున్నారు. అనంతరం మొదటి సెషన్‌లో విద్య-వైద్యం అంశంపై ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి పూర్వ సభ్యులు ఎం.వి.ఎస్. శర్మ ముఖ్య వక్తగా మాట్లాడనున్నారు. ఆ తర్వాత సెషన్‌లో పారిశ్రామికీకరణ, ఉపాధి అవకాశాలపై జివిఎంసి కార్పొరేటర్‌పై బి.గంగారావు ముఖ్య అతిథిగా ప్రసంగించనున్నారు. అనంతరం చివరి సెషన్‌లో వ్యవసాయం, నీటి ప్రాజెక్టులపై నీటిపారుదల విశ్రాంత చీఫ్ ఇంజినీర్ ఉప్పలపాటి నారాయణరాజు ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారు.

ఎచ్చెర్ల ఎంపిపి అరెస్టు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఎచ్చెర్ల ఎంపిపి మొదలవలస చిరంజీవిని పోలీసులు పరదుపేటలోని స్వగ్రామంలో శనివారం రాత్రి అరెస్టు చేశారు. జి.ఆర్.పురం సిఐ రామచంద్రరావు ఆధ్వర్యంలో పోలీసులు నోటీసులు ఇచ్చి అరెస్టు చేశారు. ఎచ్చెర్ల సమీపంలోని ట్రిపుల్ ఐటి వద్ద ఈ నెల 9న ఎచ్చెర్ల మాజీ సర్పంచ్ జరుగుల శంకరరావుపై జరిగిన దాడి కేసులో ఎంపిపిని అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. తన భర్తపై జరిగిన దాడిలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, ఎంపిపి మొదలవలస చిరంజీవి హస్తం ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఆ దిశగా విచారణ చేసిన పోలీసులు ఎంపిపి అనుచరులుగా భావిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిసింది. దీంతో పాటు ఎంపిపి కాల్ డేటా, సిసి కెమెరాల పుటేజీ ఇతర ఆధారాలతో ఎంపిపిని గుర్తించి అరెస్టు చేశారు. నేరంతో ప్రమేయం ఉన్న మరికొందరిని అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.



ఎంపిపి చిరంజీవిని అరెస్టు చేస్తున్న పోలీసులు

నాణ్యమైన విద్యను అందించాలి

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్



కవిటి : విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌ప్రకాష్

ప్రజాశక్తి- కవిటి

నాడు-నేడు, బైజ్యూస్ ట్యాబులు, ఆంగ్ల మాధ్యమం తదితర అంశాలతో ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తోందని, దాన్ని పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందించే బాధ్యత ఉపాధ్యాయులదేనని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. మండలంలోని ఆర్.బెలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలను శనివారం తనిఖీ చేశారు. పరీక్షలు దగ్గర పడుతున్నా ఆర్.బెళగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇప్పటికీ పూర్తిస్థాయిలో సిలబస్ పూర్తి చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. చాలామంది విద్యార్థులు నోట్స్ సక్రమంగా రాయకపోవడం, ట్యాబులు తేకపోవడంపై ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 11 మంది అధ్యాపకులు ఉంటే... 220 మంది విద్యార్థులు మాత్రమే ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. వచ్చే ఏడాదిలో కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని ఆదేశించారు. అనంతరం తరగతి గదులు పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ముఖ్యంగా తరగతి గదిలో సరైన వెలుతురు లేకపోవడంపై సంబంధిత సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రూ.1.30 కోట్లతో చేస్తున్న నాడు-నేడు పనులపై పర్యవేక్షణ లేదని, ప్రభుత్వ ధనం ప్రజా ధనంగా భావించి పనిచేయాలని సూచించారు. కళాశాల ఆవరణలో మరుగు దొడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌జెడి జ్యోతికుమారి, డిఇఒ వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసి జయప్రకాష్, డివిఇఒ కె.ప్రకాశరావు, ఆర్ఐఒ పి.దుర్గారావు, ఐ పవర్ కమిటీ శ్యామ్ సుందర్, ఎంఇఒలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై మండిపాటు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శనివారం పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పనితీరుపై మండిపడ్డాడు. విద్యార్థులకు వచ్చిన ట్యాబ్‌లు సగం తీసుకురాకపోవడం, కొన్ని పనిచేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయిలు ఖర్చు చేస్తూ విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తే... అవి పనిచేయడం లేదని గుర్తించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనిచేయడానికి ఇష్టం లేకపోతే మానేయండి హెచ్చరించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాస్‌లు తీసుకున్నారు. అదేవిధంగా లాలాపేట మున్సిపల్ పాఠశాలను తనిఖీ చేశారు. ఇంకా సిలబస్ పూర్తి చేయకపోవడంపై మండిపడ్డారు. 60 మంది విద్యార్థులకూ సిలబస్ పూర్తి చేయలేరా? అని ఉపాధ్యాయులున ప్రశ్నించారు. ఈయన వెంట ఆర్‌జెడి జ్యోతికుమారి, డిఇఒ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డిఇఒ విజయలక్ష్మి, ఎంఇఒ అప్పారావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

చేనేత సంఘాల సమస్యలు పరిష్కరిస్తాం

ఆప్కో ఎమ్‌డి పావనమూర్తి

ప్రజాశక్తి- పొందూరు

చేనేత సంఘాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆప్కో ఎమ్‌డి ఆర్.పావనమూర్తి తెలిపారు. పొందూరు మండల కేంద్రంలోని సాయిబాబా చేనేత సహకారి సంఘాన్ని, ఏఎఫ్‌కేకే సంఘాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత సహకార సంఘాల్లో పేరుకుపోయిన సరుకులను కొనుగోలు చేయడంతో పాటు సంఘాలకు బకాయిలను చెల్లించేందుకు చర్యలు తీసుకొంటామని అన్నారు. గతేడాది డిసెంబరు వరకూ చేనేత సహకార సంఘాలకు ఉన్న బకాయిలను చెల్లిస్తుందని అన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు సరిపడ్డ స్కూల్ యూనిఫారాలను ఉత్పత్తి చేయడానికి తగినంత మంది కార్మికులు లేరని, స్కూల్ యూనిఫారాలు తయారు చేసేందుకు సరిపడే నేతకార్మికులు కేవలం కడపలోనే ఉన్నారని అన్నారు. అందుకే ప్రభుత్వం యూనిఫారాల క్లాత్‌ను ఇతర మార్గాల్లో కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. దుప్పట్లు, తువ్వాళ్లు, ఇతర వస్త్రాలను ప్రభుత్వం ఆప్కో నుంచి మాత్రమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. పొందూరు చేనేత సంఘం ద్వారా గోరు అంచు పంచెలు కొనుగోలుకు ఆప్కో సిద్ధంగా ఉన్నా... ఇక్కడ గోరు అంచు పంచెలు అందించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఏఎఫ్‌కేకే సంఘాన్ని పరిశీలించి ఖాదీ వస్త్రాల తయారీ ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే ఖాదీ కార్మికులకు మరింత ఎక్కువ పనిని కల్పించగలమని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కామేశ్వరప్రసాద్, దండా వెంకటరమణలు పేర్కొన్నారు. ఆప్కో ఎండీతో పాటు చేనేత జౌళ్లశాఖ ఎడి ధర్మారావు, సాయిబాబా చేనేత సంఘం మేనేజర్ వట్టం శ్రీనివాసరావు ఉన్నారు.



పత్తిని పరిశీలిస్తున్న ఆప్కో ఎమ్‌డి పావనమూర్తి

మూలపేట పోర్టు రైల్వే ట్రాక్‌కు భూసేకరణ

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో నిర్మాణంలో ఉన్న మూలపేట పోర్టుకు అవసరమైన రైలు మార్గాన్ని నిర్మించడానికి రైతుల నుంచి భూములను సేకరిస్తున్నామని, నిర్వాసిత రైతులు నష్టపోకుండా పరిహారం చెల్లిస్తామని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని జెసి ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌లతో కలిసి సంతబొమ్మాళి మండలం కూర్మనాథపురం, యామలపేట, పోతునాయుడు పేట, కోటపాడు, కాశీపురం, రాజపురం గ్రామాల రైతులతో భూసేకరణపై శనివారం సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ రైల్వే మార్గాన్ని నిర్మించడానికి ఆరు గ్రామాల నుంచి 72 ఎకరాలు భూమి అవసరముందని తెలిపారు. పంటల సమయంలో వ్యక్తిగతంగా వచ్చి ఈ భూములను తాను పరిశీలించినట్లు వివరించారు. పొలాలకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్డు రైలు ట్రాక్ అనుసంధానంగా ఉండే విధంగా భూసేకరణ చేస్తున్నట్లు చెప్పారు. ముంపు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. టెక్కలి సబ్ కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైన భూసేకరణ చేపట్టి మారిటైం బోర్డుకు అప్పగించాల్సి ఉంటుందన్నారు. భూముల ధరలపై ఇప్పటికే మూడుసార్లు రైతులతో చర్చించినట్లు వివరించారు. యామలపేట సర్పంచ్ రవికుమార్ మాట్లాడుతూ గ్రామాల్లోకి నీరుపోకుండా రక్షణ గోడలను నిర్మించాలని కోరారు. మిగిలిన పొలాలు ముంపునకు గురికాకుండా చూడాలని రైతులు కోరారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జి.సెక్షన్ సూపరింటెండెంట్ జి.ఎల్.ఇ.శ్రీనివాసరావు, సంతబొమ్మాళి తహశీల్దార్ జి.సత్యనారాయణ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్, జెసి

'ఆప్కాస్'లో చేర్చే వరకు పోరాటం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు



ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్, ఆమదాలవలస

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఎఆర్ఎఆర్ఎస్‌లు, కెవికెల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ ఆప్కాస్‌లో చేర్చే వరకు పోరాటం ఆగదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎఆర్ఎస్, ఆర్ఎఆర్ఎస్ కెవికెల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాగోలులోని వ్యవసాయ పరిశోధనస్థానం, పట్టణంలోని ఆచార్య ఎన్‌జి రంగా పరిశోధనా స్థానం ఎదుట కార్మికులు సమ్మె శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ శిబిరాలకు సిఐటియు తరుపున మద్దతు తెలియజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లుగా రీసెర్చ్ స్టేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు లేబర్ వివరాలను రీసెర్చ్ స్టేషన్లలో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరినీ ఎపి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కాస్)లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది మొత్తం ఉపాధి కల్పించాలన్నారు. కార్యాలయంలో స్వీపర్, అటెండర్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్.ప్రకాష్, ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రం కాంట్రాక్టు కార్మికుల అధ్యక్షులు ఎన్.సీతామహాలక్ష్మి, కార్యదర్శి త్రివేణి, కె.కృష్ణవేణి, సుజాత, కొండమ్మ, జ్యోతిప్రసాద్, శ్రీను, అంబటి యుగంధర్, గణపతి పాల్గొన్నారు.

పారదర్శకంగా నిఘా వ్యవస్థ

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో రానున్న సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగస్వాములయ్యే నిఘా వ్యవస్థ పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. కలెక్టరేట్‌లోని నిఘా బృందాలు, పలుశాఖల ఉన్నతధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను నిరోధించడం, ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం, నిరంతర తనిఖీల నిర్వహణ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఇసిఐ నూతన మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల వ్యయం విషయంలో ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తోందని చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నిఘా బృందాలు సమర్థవంతంగా, నిబద్ధతతో, నిబంధనలకు అనుగుణంగా సమదృష్టితో వ్యవహరించాలన్నారు. తమపై వివక్షను ప్రదర్శించారనే ఫిర్యాదులు రాకుండా పక్కాగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల విధులపై నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి వాస్తవాలను నిర్ధారించిన తర్వాత చర్యలకు ఉపక్రమించాలన్నారు. నిఘా బృందాల దృష్టిని మళ్లించేందుకు తప్పుడు ఫిర్యాదుల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎన్నికల వ్యయం, ప్రచార సరళిపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. నగదును జప్తు చేసిన సందర్భాల్లో తగు రీతిలో పంచనామా నిర్వహించడం తప్పనిసరిగా రశీదులు అందించాలన్నారు. తగిన ఆధారాలను చూపించి నగదును తిరిగి పొందడానికి వీలుంటుందని గుర్తుచేశారు. సమావేశంలో ఎస్‌పి జి.ఆర్.రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అడిషనల్ ఎస్‌పి ప్రేమకాజల్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

దాడులు, దౌర్జన్యాల తొడుగు



నేటి రాజకీయాల్లో ఎత్తుగడలు నిరంతరం మారుతూనే ఉన్నాయి. అందులో ప్రజల ప్రయోజనాల కన్న.. రాజకీయ ప్రయోజనాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఈ ధోరణి మరింత ఎక్కువగా ఉంటుంది. రాష్ట్ర రాజకీయాల్లో జరుగుతున్న పొత్తుల చదరంగంలో జిల్లా కూడా ఒక పావుగా మారనుంది. ప్రధాన రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో అభ్యర్థులను ప్రకటించకున్నా రాజకీయ మంటలు అలుముకున్నాయి. ప్రధానంగా ఎచ్చెర్ల నియోజకరవ్గంలో ఎప్పుడూ లేని విధంగా ప్రత్యర్థులపై దాడులు కన్నా... స్వపక్షం నేతలపైనే దాడులు జరగడం ప్రజాస్వామ్యవాదులకు ఆందోళన కలిగిస్తుంది. దాడులు, దౌజన్యాలతో జిల్లాలో దుర్మార్గమైన రాజకీయాలకు కొత్త అంకం మొదలైనట్లయింది. జరిగిన దాడి సామాజిక అంశం రూపంలో ముందకురావడం ప్రమాదకరమైన అంశం. ఆ నియోజకవర్గం ఓ స్థానిక ప్రజాప్రతినిధిపై దాడి చేయడంతో మరో రెండు సామాజిక తరగతుల ప్రమేయం ఉందన్న ప్రచారం ఉంది. ఆ ప్రచారానికి బలపరిచే విధంగా ఆ సామాజిక తరగతికి చెందిన వారు నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. జిల్లా ఎస్‌పికి వినిపత్రం అందించడం, అందులో దాడికి పాల్పడిన వారి పేర్లను రాయడం చర్చనీయంశమైంది. అదే సమయంలో దాడికి గురైన వ్యక్తిని ఆస్పత్రిలో పరామర్శించడానికి మంత్రి వెళ్లడం సాధారణ విషయమైనా... సామాజిక అంశం తెరపైకి మరో రూపంలో వచ్చింది. ఆ నియోజకవర్గంలో కొద్దికాలం క్రితం ఓ విలేకరి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అందులో బాధ్యుల పేరు రాసి జేబులో ఉంచుకోవడం మరో చర్చనీయంశమైంది. ఆ కేసు పూర్వపరాలు వెలుగులోకి రాకుండా అధికార పార్టీ పక్కన పెట్టేలా చేసిందన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ప్రధానంగా ఎచ్చెర్ల నియోజకవర్గంలోనూ ఇలాంటి శాంతిభద్రతల సమస్య ఎక్కువగా ఉంది. స్వపక్షంలోని గ్రూపులు బలంగా ఉన్నాయి. పర్యవసానంగా టిక్కెట్ల పంపిణీలో ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపను న్నాయని ప్రచారం ఉంది. ఇదే నియోజకవర్గంలో టిడిపిలోనూ అసమ్మతి రాగం ఉంది. ఎన్నికల సమయానికి అంతా సర్దుకుంటుందని, తిరుగుబాటు ఉండదని కొందరు చెబుతున్నా... జిల్లాలోని టిడిపి గ్రూపు రాజకీయాలు ఫలితంగా అసమ్మతి రాగం ఎవరు తీయించారో ఆ నేతలే తిరుగుబాటు అభ్యర్థిని తెరపైకి తెచ్చినా ఆశ్చర్యపోనక్కర్లదేన్న ప్రచారం ఉంది. ప్రధానమైన రెండు పార్టీలకు ఈ నియోజకవర్గంలో కుడి, ఎడమగా సమస్యలను ఎదుర్కొంటున్నాయన్నది నిజం.

పాతపట్నం నియోజకవర్గంలో గ్రూపుల గోల బలంగా ఉంది. వైసిపి అభ్యర్థిని మార్చుకున్నా అసమ్మతి రాగం చివరి దశలో గళం విప్పి గాండ్రిస్తుందా! లేక మిన్నకుంటుందా! అన్నది చూడాల్సి ఉంది. టిడిపిలో మరో విచిత్రమైన పరిస్థితి ఉంది. ఇటీవల ఆ పార్టీ నేత లోకేష్ పర్యటన సమయంలో రెండు గ్రూపులు పోటీపడి జనసమీకరణకు సిద్ధమయ్యారు. ఫ్లెక్సీలు, బేనర్లు గ్రూపుల వారీ ప్రదర్శించారు. పరిస్థితి చూసి మనది క్రమశిక్షణ కలిగిన పార్టీ అని లోకేష్ సముదాయించాల్సిన పరిస్థితి ఉంది. అక్కడ టిక్కెట్ ఆశిస్తున్న వారిలో ఒకరు తిరుగుబాటు చేయడానికైనా వెనుకాడరన్న ప్రచారం ఉంది. మరో పక్కన మద్దతును కూడగట్టేందుకు అధికార పక్షం చివరి క్షణంలో ప్రయత్నాలు చేయవచ్చునన్న ప్రచారం ఎప్పటి నుంచో ఉంది. ఈ నియోజకవర్గం రాజకీయం రసపట్టులా ఉందని తెలుస్తుంది.

శ్రీకాకుళం నియోజకవర్గంలో టిక్కెట్ కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. లోకేష్ పర్యటనలోనూ తన బలాన్ని చూపించే ప్రయత్నం చేశారు. తన పేరు ఐవిఆర్ సర్వేలో పొందుపర్చేస్థాయికి వెళ్లగలిగారు. అయినప్పటికీ పార్టీ ఈ ఎన్నికలు ప్రతిష్టకు సంబంధించినది. కొత్త ప్రయోగాలతో ముందుకెళ్లదన్న ప్రచారం ఆ పార్టీలోనే ఉంది. ఈ నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో తిరుగుబాటు బెడద ఉండదని, అంతా సమసిపోతుందని నమ్మకాన్ని పలువురు వ్యక్తం చేయడం విశేషం.

జిల్లాలో వైసిపి టిక్కెట్ ఆశించిన డాక్టర్ ధానేటి శ్రీధర్ ఆశలు వదులుకొని జనసేనలో చేరారు. ఆయనకు తప్పకుండా జిల్లాలో ఏదో ఒక నియోజకరవ్గంలో పొత్తులో భాగంగా టిక్కెట్ ఇస్తారని పవన్‌కళ్యాణ్ భరోసా ఇచ్చారన్న ప్రచారం బలంగా ఉంది. జనసేన జాబితాలో పలాస, శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాలు ఉన్నట్లు తెలిసింది. ముఖ్యంగా పలాస నియోజకవర్గంలో పొత్తుల్లో భాగంగా జనసేకు వచ్చే అవకాశం ఉందని కొందరు జనసేన నేతలు చెబుతున్నారు. అక్కడ మంత్రి అప్పలరాజును ఓడించడం తమ లక్ష్యమని, టిక్కెట్ మార్చకుంటే అదే జరుగుతుందని గతంలో ప్రకటన చేసిన అసమ్మతి బృందం ఉంది. జనసేనకు టిక్కెట్ ఇస్తే ఆ అసమ్మతి బృందం శ్రీధర్‌కు మద్దతు ఇస్తారా! లేదా అన్నది కాలం చెప్పాలి ఉంది. జిల్లా రాజకీయాల్లో మరికొన్ని మార్పులు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. బిజెపితో టిడిపి పొత్తు ఖరారైన తరువాత రాజకీయ పొందికలో జిల్లాలో మార్పులు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే కిషోర్‌చంద్రదేవ్ టిడిపికి రాజీనామా చేశారు. బిజెపితో పొత్తు జిల్లాలో ముఖ్య నాయకులకు ఇష్టం లేదని, కలిసి వెళ్తే నష్టపోతామన్న భయం వారిలో వెంటాడుతున్నట్లు తెలిసింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ జిల్లాలో పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు అన్ని నియోజకరవర్గాల్లో పోటీ చేయడానికి సన్నద్ధమవుతుంది. మరోవైపు మిత్రుల కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిసింది. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో టిడిపి నేత లోకేష్ నిర్వహించిన సభల్లో సుమారు 40 వేల మంది వరకు పాల్గొనట్లు ఇంటిలిజెన్స్ సమాచారం బట్టి తెలుస్తుంది. సభల్లో ఎంత మంది పాల్గొన్నా... టిడిపి ప్రభుత్వ వైఫల్యాలను దాచిపెట్టి కొత్త వాగ్దానాలు చేయడం అలవాటైంది. జిల్లాలో ఆఫ్‌షోర్ ప్రాజెక్టును అధికారంలోకి వచ్చాక మూడేళ్లలో పూర్తిచేస్తామని లోకేష్ చెప్పడం విడ్డూరం. చంద్రబాబు పాలనలోనే ఆ ప్రాజెక్టు ముందుకు సాగలేదు. నిధుల కోసం, బిల్లుల చెల్లింపు కోసం ఆ పార్టీ అప్పటి ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర్ శివాజీ గడ్డం పెంచుకోవడం, మౌనవ్రతం పాటించడం లాంటి నిరసన కార్యక్రమాలు చేపట్టినా చంద్రబాబుకు పట్టలేదు. ఇది జనం మరవని చరిత్ర. టిడిపి, జనసేన పొత్తుల తరువాత జరిగిన సభలివి. వైసిపిలో సానుకూల ప్రచారం, టిడిపిలో ప్రతికూల అంశాలు ప్రచారంలో జిల్లా ప్రజలు ఎలాంటి తీర్పునిస్తారో చూడాల్సి ఉంది.

- సత్తారు భాస్కరరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

'రాజధాని ఫైల్స్'తో వైసిపిలో వణుకు

ప్రజాశక్తి- కవిటి

రాజధాని ఫైల్స్ సినిమాతో సిఎం జగన్మోహన్ రెడ్డి వెన్నులో వణుకు పుడుతోందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాలం అశోక్ అన్నారు. మండలం రామయ్యపుట్టుగలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 34వేల మంది రైతుల త్యాగాలకు సినిమా వాస్తవరూపంగా నిలిచిందని కొనియాడారు. 5 కోట్ల ఆంధ్రుల కలల రాజధాని తుగ్లక్ పాలనలో ఎలా నాసనమైందో కళ్ళకు కట్టినట్లు ఈ సినిమాలో చూపించారన్నారు. రైతుల బతుకు చిత్రంపై తీసిన సినిమా అడ్డుకునే నీచస్థితికి సిఎం దిగజారిపోయారని ఎమ్మెల్యే అశోక్ విమర్శించారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని లూటీ చేసిన సిఎం ఇక ఉమ్మడి రాజధాని అంటూ కొత్త రాగం తీశారని ఎద్దేవా చేశారు. రోజురోజుకూ టిడిపికి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక విష ప్రచారం మొదలుపెట్టారని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా టిడిపి విజయం తథ్యమని ఆయన జోస్యం చెప్పారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.


నోటీసు అందజేస్తున్న పోలీస్

ఉపాధ్యాయునికి నోటీసు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ఈ నెల 18న విజయవాడలో పాతపెన్షన్ పునరుద్ధరణకు తలపెట్టిన 'ఓటు ఫర్ ఓపిఎస్' ధర్నా నిర్వహించనున్నారు. ఈ ధర్నాకు వెళ్లనీయకుండా 'ఎపిసిపిఎస్ఇఎ' జిల్లా గౌరవ అధ్యక్షులు రెడ్డి సూరిబాబుకు పోలీసులు శనివారం నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ 2022 సెప్టెంబరు 1 సందర్భంగా ఇప్పటికే 1500 మందిపై ప్రభుత్వం అక్రమంగా కేసులు నమోదు చేసిందని అన్నారు. ఈ కేసులకు భయపడి ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చమని ప్రజాస్వామ్యయుతంగా చేస్తున్న ఆందోళనలను ప్రభుత్వం అణిచివేయాలని అనుకోవడం మూర్ఖత్వమన్నారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా సిపిఎస్ రద్దు ఉద్యమాన్ని అడ్డుకోవాలని చూస్తే దానిని ప్రజాస్వామ్య పద్ధతిలో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

'విధుల నిర్వహణతో సంబంధం లేదు'

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండల గ్రామ, మండల సమైక్య సంఘాలకు, వెలుగు సిబ్బంది విధులకు సంబంధించి తొలగించబడ్డ సిఎఫ్ పరపటి సుమలతకు ఎటువంటి సంబంధం లేదని వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ శ్రీరాములు శనివారం తెలిపారు. తొలగించిన సీఎఫ్ దర్జాగా విధులు అని ఈ నెల 16న ప్రజాశక్తిలో వచ్చిన వార్తపై వెలుగు అధికారులు స్పందించారు. రూ.2,40,000 అవినీతి చేసినట్లు రుజువు కావడంతో తీర్మానం చేసి గతంలోనే తొలగించామని స్పష్టం చేశారు. నౌపడ స్టేట్‌బ్యాంక్ అధికారులకు ఈ విషయం స్వయంగా తెలియజేశామని, తదుపరి ఆదేశాలు వచ్చినంత వరకు ఎవరిని విధుల్లోకి తీసుకోవద్దని కోరామన్నారు. ఇన్‌ఛార్జిగా తార సుధారాణిని నియమించామని వివరించారు.


పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ అమ్మాయమ్మ

సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- పొందూరు

మండలం వి.ఆర్.గూడెంలో సిసి రహదారి, కాలువ నిర్మాణం పనులను శనివారం సర్పంచ్ సువ్వారి అమ్మాయమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో పాత సచివాలయం నుంచి పేడాడ మన్మధరావు ఇంటివరకూ సిసి రహదారి, కాలువ నిర్మాణానికి పనులు చేపట్టారు. ఈ రహదారి నిర్మాణం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఖర్చు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సువ్వారి మధు, ఉపసర్పంచ్ ప్రతినిధి సువ్వారి గోవిందరావు, వర్క్ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం దుకాణంతో ప్రజలకు ఇక్కట్లు

ప్రజాశక్తి- రణస్థలం

స్థానిక రామతీర్థాలు వేళ్లే రహదారి పక్కన ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులు నడిచి వెళ్లే రహదారి. నిత్యం వేలాది వాహనాలు ప్రయాణం చేసే రహదారి సమీపంలోనే మద్యం దుకాణం ప్రభుత్వం ఏర్పాటు చేయడం, రహదారికి అనుకుని ఉండటంతో ప్రమాదాలకు కారణంగా నిలుస్తుందని పలువురు ఆరోపిస్తున్నాయి. మండల కేంద్రానికి సమీపంలో ఉండడంతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అరకిలో మీటరు దూరంలో ఉండడం, ఈ రహదారి గుండా ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్ విద్యార్థులు, మోడల్ కళాశాల విద్యార్థులు, ప్రయివేట్ ఐరీస్ స్కూల్ విద్యార్థులు, ప్రభుత్వ 30 పడకల ఆస్పత్రి సిబ్బంది, రోగులు, అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఈ మద్యం దుకాణం ముందు నుంచే నడిచి, సైకిల్‌పై, వాహనాలపై వెళ్తుంటారు. ఈ రహదారి గుండా నిత్యం వేలాదిగా లారీలు, బస్సులు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో ప్రభుత్వ మద్యం దుకాణానికి సమీపంలో కూర్చొని మద్యం సేవించేందుకు ఇతర దుకాణాలు ఉన్నాయి. మద్యం దుకాణం వెనుక ఖాళీ ప్రదేశం, తోటలు ఉండడంతో మద్యం సేవించే వారు అక్కడే పనికానిస్తున్నారు. ప్రధాన రహదారిపై ఈ విధంగా పరిస్థితులు ఉంటే సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదో అంతుచిక్కడం లేదు. మద్యం కొనుగోలు చేసి వచ్చే సందర్భంలో, మద్యం సేవించి వచ్చే సందర్భంలో ఆ ప్రాంతంలో ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగాయి. మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలన్నీ రహదారులకు దూరంగా ఉన్న ఈ ఒక్క మద్యం దుకాణం మాత్రం రహదారి సమీపంలో ఉండటం ప్రమాదాలకు నిలయంగా మారిందని, మద్యం దుకాణాన్ని ఆ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.


రామతీర్థాలు రోడ్డుకు అనుకుని ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం

సరిహద్దులో నిఘా పెంచాలి

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాను మాదక ద్రవ్యావాడకానికి అడ్డుకట్ట వేసేందుకు సమర్థవంతంగా తనిఖీలు చేపట్టాలని, ప్రధానంగా సరిహద్దుల్లో నిఘా పెంచాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని జిల్లాస్థాయి అధికారులతో మాదక ద్రవ్యాల నివారణ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్తు పదార్థాల నివారణ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నిరోధానికి చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల బారిన పడితే జీవితాలు నాశనం అవుతాయన్న విషయంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రజల్లో సంపూర్ణ అవగాహన కల్పిస్తే నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. జిల్లాలోని అన్నీ ప్రభుతాస్పత్రుల పరిధిలో డి అడిక్షన్ సెంటర్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మద్యానికి బానిసైన వారిని ఆ అలవాటును మాన్పించడానికి శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ, వైద్య కళాశాల, ఇంజినీరింగ్, వ్యవసాయ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. దీనికి విద్యాశాఖ కీలక పాత్ర పోషించాలన్నారు. అలాగే కార్మికులు పనిచేసే ప్రదేశాల్లో, గుర్తించిన హాట్ స్పాట్ ప్రదేశాల్లో గంజాయి వంటి మాదకద్రవ్యాల రవాణాపై నిఘా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణాలో భాగస్వాములుగా వారు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా తీవ్రమైన నేరంగా పరిగణించాలన్నారు. ఎస్‌పి జి.ఆర్.రాధిక మాట్లాడుతూ జిల్లాకు ఒడిశా సరిహద్దు 112 కిలోమీటర్ల విస్తరించి ఉందని, ఒడిశా నుంచి 52 రహదారుల ద్వారా రాకపోకలు జరుగుతున్నాయని వివరించారు. వీటిలో ఆరు ప్రధాన రహదారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, మిగిలిన మార్గాల్లో నిశిత పరిశీలనకు నిరంతరం పెట్రోలింగ్ జరుగుతోందని అన్నారు. గడిచిన


మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఆరు నెలల్లో 110 కిలోల గంజాయి అక్రమ రవాణా అడ్డుకుని 14 మందిని వేర్వేరు కేసుల్లో అరెస్టు చేశామన్నారు. జిల్లాలో ట్రామాడాల్ టాబ్లెట్స్, ఇంజెక్షన్ల వాడకాన్ని డ్రగ్ కంట్రోల్ అధికారులు తరచూ పర్యవేక్షించాలని, వాటి వినియోగంలో వైద్యుల ప్రిస్క్రిప్షన్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అడిషనల్ ఎస్‌పి ప్రేమకాజల్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, అటవీ శాఖ, డ్రగ్ కంట్రోల్, విద్యాశాఖ, పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


బూర్జ : మాట్లాడుతున్న సిడిపిఒ గీత

బాలల రక్షణ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి- బూర్జ

బూర్జ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జెడ్‌పిటిసి రామారావు ఆధ్వర్యంలో మండలస్థాయి బాలల సంక్షేమ, రక్షణ కమిటీ, బాల్య వివాహ నిరోధక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి చైర్పర్సన్‌గా ఎంపిపి కర్నేన దీప, కన్వీనర్‌గా సిడిపిఒ గీత, మండల అధికారులు జిఒ ఎంఎస్ నెంబర్ 31 ప్రకారం సభ్యులుగా నియమించారు. ఈ సమావేశంలో బాల్యవివాహాలు నిర్మూలన, ఇతర నిబంధనలు, బాల్య వివాహ నిరోధక, పర్యవేక్షణ కమిటీ ఏర్పాటుపై ఎంపిపి వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కె.నాగేశ్వరావు, జిల్లా బాలల రక్షణ విభాగం సోషల్ వర్కర్ ఐ.జనార్ధన, ఎ.గీత పాల్గొన్నారు.

పొందూరు: బాల్య వివాహ నిరోధక చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఐసిపిఎస్ జిల్లా బాలల రక్షణ విభాగం న్యాయ పర్యవేక్షణాధికారి ఆర్.లక్ష్మణరావు పేర్కొన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయిలో బాల్యవివాహ నిరోదక, పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటుపై సిడిపిఒ అనూరాధ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిఒ నెంబర్ 31, ఫోక్సో యాక్టు, రక్షణ, సంరక్షణకు అవసరమైన బాలల కోసం చైల్డ్‌హెల్ప్‌లైన్ నెంబర్ 1098 వంటి పలు విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటైన మండలస్థాయి కమిటీలో ఎంపిపి చైర్‌పర్సన్‌గా, కన్వీనర్‌గా సిడిపిఒ, తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఇఒ ఇతర మండలస్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, ఇఒపిఆర్‌డి సింహాచలం, ఎంఇఒ పి.వి.రామరాజు, ఎపిఎం గురుగుబెల్లి శ్యామలరావు, వైద్యాధికారి రమేష్‌నాయుడు పాల్గొన్నారు.


అభినందిస్తున్న మంత్రి ప్రసాదరావు

విద్యార్థులకు మంత్రి అభినందనలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జెఇఇ మెయిన్స్‌లో ప్రతిభ కనబరచిన చక్రధర్ జూనియర్ కాలేజి విద్యార్థులను రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అభినందించారు. శనివారం పేపరు సిటీలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కళాశాల చైర్మన్ యాళ్ల చక్రధర్, ప్రతిభ కనబరచిన 17 మంది విద్యార్థులు మంత్రిని కలుసుకున్నారు. రానున్న అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించడంతో పాటు ఐఐటి, నిట్‌ల్లో సీట్లు దక్కించుకోవాలని మంత్రి సూచించారు.


గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కబడ్డీ పోటీల విజేత బోరుభద్ర

సంతబొమ్మాళి: జిల్లాస్థాయి గ్రిగ్స్ అంతర పాఠశాలల పోటీల్లో కబడ్డీ సీనియర్స్ బాలురు విభాగంలో విజేతగా బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిలిచినట్లు హెచ్‌ఎం పి.రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు క్రీడల్లో చక్కటి శిక్షణను అందించి విజేతలుగా నిలిచేందుకు విశిష్ట కృషి చేసిన వ్యాయమ ఉపాధ్యాయులు పి.తిరుపతిరావు, సాయి శివానిలను సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో చక్కగా రాణిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.లోకేశ్వరరావు, ఎ.వెంకటరెడ్డి, కె.త్రినాధరావు, బాడాన రాజు, ఉమాదేవి, రమణమ్మ, విజయలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

21 నుంచి ప్రజాపోరు

లావేరు: బిజెపి ఆధ్వర్యంలో త్వరలో చేపట్టనున్న ప్రజాపోరు కార్యక్రమాన్ని విజయంతం చేయాలని బిజెపి విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజ్జాడ శ్రీనువాసరావు పిలుపునిచ్చారు. శనివారం బెజ్జిపురంలో బిజెపి డిమాండ్ల సమావేశం అధ్యక్షుడు పిన్నింటి రమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఈనెల 21 నుంచి ప్రజాపోరు కార్యక్రమంలో ప్రతి కార్యకర్త, నాయకులు పాల్గొనాలన్నారు. ఈనెల 27న పైడిభీమవరం వద్ద జరుగనున్న బహిరంగ సమావేశంలో కేంద్రమంత్రి రాజనాధ్ సింగ్ పాల్గొంటారని, ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా చూడాలన్నారు. సమావేశంలో అసెంబ్లీ కో-కన్వీనర్ సంపతిరావు నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు పులపా వెంకటరత్నం, జిల్లా కార్యదర్శి మన్నే సురేష్ కుమార్, ఇప్పర్తి అధియ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బహుమతిని అందుకుంటున్న భానోజీనాయుడు

ఫిల్లింగ్ స్టేషన్‌కు రాష్ట్రస్థాయి బహుమతి

లావేరు: మండలంలోని తాల్లవలస పద్మావతి ఫిల్లింగ్‌స్టేషన్‌కు రాష్ట్రస్థాయిలో ఉత్తమ బహుమతి లభించింది. అన్ని రంగాల్లో ఉత్తమ సేవలు అందించినం దుకుగాను ఈ బహుమతిని శనివారం విజయవాడ నోవేటాల్ హోటల్‌లో అందించారు. ఈ కార్యక్రమానికి బంక్ యజమాని, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఆర్గనైజేషన్ సెక్రటరీ, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు అవార్డును స్వీకరించారు.

వి.ఆర్ గూడెంలో గ్రామసభ

పొందూరు: మండలం వి.ఆర్ గూడెంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం, పంచాయతీ రాజ్ విభాగం కింద జరిగిన పనులకు సంబంధించి శనివారం సామాజిక తనిఖీ గ్రామసభను సర్పంచ్ సువ్వారి అమ్మాయమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఆర్థిక సంవత్సరంలో మొత్తం 10 పనులు కింద జరిగిన సుమారు రూ.22లక్షల ఖర్చుపై జరిగిన తనికీలపై గ్రామసభను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సువ్వారి మధు, డిఆర్‌పి డి.శివకుమార్, టిఎ నటరాజ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం నాశనం


సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న రామ్మోహన్‌నాయుడు, శిరీష

ప్రజాశక్తి- పలాస

జగన్ పాలనలో రాష్ట్రం నాశనమైందని ఎంపీ రామ్మోహన్ నాయుడు అన్నారు. మందస మండలం బోగాబందలో ఎంపీ నిధులు రూ.5 లక్షలతో నిర్మాణం చేపట్టిన సామాజిక భవనాన్ని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషతో కలిసి ప్రారంభించారు. అనంతరం మందస మండలం బోగాబంద, బసవసాయి, కొంకడాపుట్టి పంచాయతీలకు చెందిన సుమారు 50 గిరిజన కుటుంబాలు టిడిపిలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు వైసిపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. వైసిపి నేతలకు అధికార వ్యామోహం తప్ప అభివృద్ధి పట్టదని ఆరోపించారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి శూన్యమన్నారు. టిడిపి అధికారం చేపట్టిన వెంటేనే గిరిజన ప్రాంతాల్లో రోడ్లు బాగు చేస్తామని, డబార్ సింగి ప్రాజెక్టు, కాలువలు మరమ్మతులు చేస్తామని హమీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో వైసిపి ఎస్‌టి సెల్ కార్యదర్శి సవర రాజు, వైసిపి వార్డు మెంబర్ బర్రు గోపాలరావు, రత్నాల వర ప్రసాదరావు, బేసి లక్ష్మీ, జన్ని అమ్మాయి, సాన రమణమ్మ తదితరులు చేరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు దాసరి తాతారావు, తమిరి భాస్కరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, ప్రధాన కార్యదర్శి లబ్బ రుద్రయ్య పాల్గొన్నారు.

జెమ్స్‌కు ఎక్స్‌లెన్స్ ఇన్ హెల్త్ కేర్ సర్వీస్ అవార్డు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి చీఫ్ మినిష్టర్స్ అవార్డు ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ హెల్త్ కేర్ సర్వీస్ అవార్డు దక్కించుకుంది. ఈ నెల 13న ఒడిశా ప్రభుత్వం ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లో చీఫ్ మినిష్టర్స్ అవార్డు ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ హెల్త్‌కేర్ సర్వీస్ అవార్డు ప్రధానోత్సవ సభ నిర్వహించారు. ఈ అవార్డుల జాబితాలో దేశంలో 22 ఆస్పత్రులు ఉండగా ఎపి నుంచి జెమ్స్ ఆస్పత్రికి మాత్రమే ఈ అవార్డు దక్కింది. రోగుల భద్రత, అందిస్తున్న సౌకర్యాల విభాగంలో ఒడిశా ప్రభుత్వం జెమ్స్ ఆస్పత్రి సేవలపై పూర్తిస్థాయి సంతృప్తి వ్యక్తం చేస్తూ ఈ అవార్డును ప్రకటించింది. ఒడిశా ప్రభుత్వం అందిస్తున్న బిఎస్‌కెవై పథకం ద్వారా ఉచిత వైద్యసేవలు అందించడం జెమ్స్ ఆస్పత్రి ప్రత్యేక చొరవ చూపడంతోనే ఈ అవార్డును సొంతం చేసుకున్నామని జెమ్స్ ఆస్పత్రి సిఇఒ బొలినేని అద్విక్ పేర్కొన్నారు. ఈ అవార్డును ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్ చేతులమీదుగా అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అద్విక్ మాట్లాడుతూ వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది సహాయంతోనే ఈ అవార్డును పొందగలిగామని, ఈ అవార్డు తమ బాధ్యత మరింత పెంచిందన్నారు. ఈ అవార్డును అందుకున్న వారిలో సిఒఒ ఎస్ రామ్మోహన్, డైరక్టర్ డాక్టర్ సుధీర్, ఆర్‌ఎంఒలు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ బాలమురళీతో పాటు ఆపరేషన్ మేనేజర్ జ్యోత్స్న ఉన్నారు.


ఒడిశా సిఎం చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఆస్పత్రి ప్రతినిధులు

'ఐతమ్'లో ముగిసిన శిక్షణా తరగతులు



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న అవినాష్


ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో ఎఐసిటిఇ ట్రెయినింగ్ అండ్ లెర్నింగ్ (ఎటిఎల్) అకాడమి సహకారంతో స్పీచ్‌సిగ్నల్ ప్రాసెసింగ్ యూజింగ్ మిషన్ లెర్నింగ్ ఆల్గోరిథమ్స్' అనే అంశంపై ఈనెల 12 నుంచి వారంరోజుల పాటు జరిగే అధ్యాపక శిక్షణా తరగతులు శనివారంతో ముగిసినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. సెంచూరియన్ యూనివర్శిటీ ఛాన్సర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సులను ప్రారంభించగా ఐఐటి హైదరాబాద్ ప్రొఫెసర్ అనిల్ కుమార్ ఉప్పల, ఎన్ఐటి వరంగల్ ప్రొఫెసర్ టి.కిషోర్ కుమార్, డాక్టర్ డి.విష్ణుమూర్తి, డాక్టర్ కె.కిరణ్ కుమార్ పాత్రో, డాక్టర్ జి.యోగేశ్వరరావులు ఈ సదస్సులకు హాజరై పలు అంశాలపై అధ్యాపకులకు అవగాహన కలిగించారన్నారు. ఎఫ్‌డీ భాగంగా నిర్మాణంలో ఉన్న మూలపేట ఫిషింగ్ హార్బర్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఎఫ్‌ఎపి ముగింపు సందర్భంగా నాగపూర్ విఎస్ఐటి ప్రొఫెసర్ అవినాష్ కేస్కర్ పాల్గొని అనేక అంశాలపై అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ డి.ఆజాద్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.జయ మన్మధరావు, ఇసిఇ హెచ్ఒడి, ఎఫ్ఎపి కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.రామారావు, కో-కోఆర్డినేటర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ జయ, ఆర్గనైజింగ్ కో-కోఆర్డినేటర్లుగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎ.జయలక్ష్మి, జె.స్వాతి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని టిడిపి మండల అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ ఎంపిపిలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, టెక్కలి నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు పూజారి శైలజ అన్నారు. శనివారం మండలం హరిశ్చంద్రపురం, వింజాంపాడు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ దృష్ట్యా టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రజలు సహకరించాలని, రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీగా కింజరాపు రామ్మోహన్ నాయుడు, సిఎంగా చంద్రబాబునాయుడును అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సుమారు ఐదేళ్ల జగన్ పాలనలో


కార్యకర్తలకు పోస్టర్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

అన్ని వర్గాలవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిసిలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొండు లక్ష్మణరావు, నంబాళ శ్రీనివాస్, సాసుమంతు ఆనందరావు, హనుమంతు అప్పలరాజు, దేవాది సింహాద్రమ్మ, ఉప్పాడ జయరాం, దుంపల నర్సింహామూర్తి, పట్ట సింహాచలం, కోట నాగేశ్వరావు, బెండి అన్నపూర్ణ పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులు వేగవంతం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మొదలవలస చిరంజీవి అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రబీ ఈ-క్రాప్, అరుతడి పంటలపై సమీక్షించారు. జలజీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు పలువురు సభ్యులు సూచించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం ద్వారా పనుల గుర్తింపు, పనిదినాల కల్పకు ప్రణాళికలు పూర్తి చేయాలన్నారు. అంగన్వాడీ భవనాల కొరత, రోస్టర్ విధానంలో లోపాలపై ఐసిడిఎస్ అధికారులతో సమీక్షించారు. జగనన్న ఇళ్ల స్థలాల పట్టాల రిజిస్ట్రేషన్‌లో సమస్యలను పరిష్కరించాలని సభ్యులు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

ఇరువురికి గాయాలు

ప్రజాశక్తి- పర్లాకిమిడి

గజపతి జిల్లా కాశీనగర్ బ్లాక్ వళ్లాడ పంచాయతీ వంకరాడ వద్ద ద్విచక్ర వాహనం బోల్తాపడిన సంఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. రాయగడ జిల్లా గుణుపూర్ పట్టణంలో స్వీపర్ కాలనీకి చెందిన పి.సాయిరాజు, ఎస్.భాస్కరరావు ద్విచక్ర వాహనంతో గుణుపూర్ నుంచి వస్తుండగా వంకరాడ వద్ద ద్విచక్ర వాహనం బోల్తాపడి తీవ్ర గాయాలకు గురయ్యారు. సమాచారం తెలుసుకొన్న అగ్నిమాపక దళం వారిని కాశీనగర్ సమూహ ఆస్పత్రికి తరలించారు.

హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి

ఈనెల 23 నుంచి 25 వరకు నంద్యాలలో జరగనున్న 52వ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు జిల్లాజట్టు ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నామని అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బాడాన నారాయణరావు ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించే ఈ జిల్లాజట్టు ఎంపికకు 16 ఏళ్లు నిండిన విద్యార్థులు హాజరుకావాలని కోరారు. విద్యార్థి వయసు ధ్రువీకరణతో పాటు ఆధార్‌కార్డు, తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 8500007272 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.


గిరిధరరావుకు చెక్కును అందజేస్తున్న స్పీకర్ సీతారాం

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలో 15వ వార్డు గణేష్‌నగర్‌కు చెందిన ఎన్‌టివి మాజీ స్ట్రింగర్ లింగుబేరి గిరిధరరావుకు స్పీకర్ తమ్మినేని సీతారాం సిఎం సహాయనిధి నుంచి వచ్చిన రూ.లక్ష చెక్కును శనివారం స్పీకర్ క్యాంపు కార్యాలయంలో అందజేశారు. గత కొంతకాలం క్రితం గిరిధరరావు అనారోగ్యం పాలై కార్పొరేట్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స జరిగి రూ. 3 లక్షల వరకు ఖర్చయ్యింది. స్పీకర్ తమ్మినేని సీతారాం ద్వారా సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా ఈ మొత్తం మంజూరయ్యింది. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు పాల్గొన్నారు.


కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న విశ్వక్సేన్

అంబేద్కర్ విగ్రహానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- లావేరు

మండలంలో గుమ్మాడంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బిఆర్ అంబెద్కర్ విగ్రహానికి ఎచ్చెర్ల జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ విశ్వక్సేన్ శనివారం కమిటీసభ్యులకు రూ. 15 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుడా చైర్మన్ ఓబులేసు

గిరిబాబును కలిసిన సుడా చైర్మన్

పలాస: సుడా వైస్ చైర్మన్ సిహెచ్ ఓబులేసు పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం అధ్యక్షుడు బల్ల గిరిబాబును శనివారం కలిశారు. పురపాలక సంఘం కార్యాలయానికి చేరుకుని ఎంఐజి లేఅవుట్లపై ఉద్యోగులకు, వార్డు ప్రజాప్రతినిధులకు అవగాహన పెంచి కొనుగోలు చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఇ.ఇ సుగుణాకర్, టిడ్కో ఇ.ఇ రమణమూర్తి, కమిషనర్ టి.నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.


రహదారి పనులు పరిశీలిస్తున్న సర్పంచ్, అధికారులు

రోడ్డు పనులు పరిశీలన

వజ్రపుకొత్తూరు: ఉద్దానం గోపినాథపురం ఉద్దానం మెలియపుట్టి గ్రామాల ప్రజల కల ఎట్టికేలకు నెరవేరింది. శనివారం చేపడుతున్న బిటి రోడ్డు పనులను సర్పంచ్ కర్ని శ్రీను, ఇంజినీరింగ్ అధికారులు రవిబాబు, నాగభూషణంతో కలిసి పనుల నాణ్యతను పరిశీలించారు. ఎఐఐబి నిధులు రూ.1.50 కోట్లుతో 2.4 కిలోమీటర్లు బిటి రహదారి పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. గత టిడిపి హయాంలో ఎన్నికల ముందు హడావుడిగా రహదారి పనులకు శంకుస్థాపన వదిలేశారని, స్థానిక మంత్రి రహదారి ప్రాధాన్యం గుర్తించి పనులు జరిగేలా కృషి చేశారని గ్రామస్తుల తరుపున సర్పంచ్ మంత్రి అప్పలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జోగారావు, భీమారావు ఉన్నారు.

ఒత్తిడి అధిగమించడంపై శిక్షణ

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

ఆహారపు అలవాట్లు, మానసిక ఆందోళనల కారణంగా ఒత్తిడికి లోనయ్యే పరిస్థితులు నెలకొన్నాయని, విద్యార్థుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటోందని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు అన్నారు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో యోగ, ధ్యానం సాధన చేయడం ద్వారా ఒత్తిడిని జయించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో యోగ, ధాన్యంపై ఎన్ఎస్ఎస్ పిఒ రమేష్ సాహు శనివారం శిక్షణ ఇచ్చారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన విద్యార్థులకు యోగాసనాలు వేయించి, ధ్యానం సాధన కు తర్ఫీదు ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగేంద్ర, రామకృష్ణ, ఆకెళ్ల రామారావు, శ్రీనివాసరావు, వినోద్‌రాజు పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న ఎన్ఎస్ఎస్ పిఒ రమేష్ సాహు